అడ్డగోలు పార్కింగ్‌తో అగచాట్లు

- జాతీయ రహదారిపైనే వాహనాల పార్కింగ్‌లు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని పోలీసులు



కంకిపాడు- గన్నవరం రోడ్డు మార్గంలో నిలిపిన లారీలు



రైతుబజార్ వద్ద జాతీయ రహదారిపై పార్క్ చేసిన వాహనాలు

కంకిపాడు: అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా కంటైనర్లు, హెవీ లోడు లారీల రహదారులపై అడ్డగోలు పార్కింగ్‌లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడక తప్పటం లేదు. రాకపోకలు సాగక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొద్ది రోజులుగా ఈ సమస్య నెలకొన్నా అధికారులు ఎవరూ ఆ వైపు కన్నెత్తి చూడకపోవటంతో కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

కంకిపాడు- గన్నవరం మార్గంలో..

కంకిపాడు- గన్నవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం చాలా ముఖ్యమైన రహదారుల్లో ఒకటి. ఈ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. గుడివాడ, గన్నవరం ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఈ రోడ్డు మార్గాన్నే వినియోగిస్తుంటారు. అయితే ఈ రోడ్డు మార్గంలో కంకిపాడు అండర్ పాస్ వద్ద, కాటన్ సర్కిల్ కూడలి పరిసరాల్లో రోడ్డు పైనే హెవీలోడు లారీలు, కంటైనర్లను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు మార్గం ఇరుకుగా మారిపోయి రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. ఎదురుగా వచ్చే భారీ వాహనాలు తప్పించుకునే అవకాశం లేకపోవటంతో వాహనదారులు ఎప్పుడెలాంటి ప్రమాదాన్ని చూడాల్సి వస్తుందోనని భయాందోళనలు చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే పోలీసుశాఖ స్పందించి అడ్డగోలుగా పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటే రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని సూచిస్తున్నారు.

కానూరు కేసీపీ కాలనీ ఎదురుగా..

పెనమలూరు: విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై ప్రైవేటు రైతుబజార్ వద్ద తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్డు పై ప్రయాణించే వారు చాలా ఇబ్బంది పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. కానూరు కేసీపీ కాలనీ ఎదురుగా ప్రభుత్వ స్థలంలో కూటమి నేతలు ప్రైవేటు రైతుబజార్ ఏర్పాటు చేసి దందా చేస్తున్నారు. అయితే విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే రైతుబజార్ ఏర్పాటు చేయటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రైతుబజార్‌కు కూరగాయలు కొనటానికి వచ్చే వారు, వారి వాహనాలు జాతీయ రహదారి పైనే నిలుపుతున్నారు. తీరిగ్గా కూరగాయాలు కొని వచ్చే వరకు వాహనాలు రోడ్డు పైనే ఉంటున్నాయి. నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉండే బందరు రోడ్డుపైన వాహనలు నిలపటంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రతి రోజూ ఇదే పరిస్థితి ఉండగా ఆదివారం రైతుబజార్ ఎదురుగా బందరు రోడ్డుపై వాహనాలు ఎక్కువగా పార్క్ చేయటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది.

చర్యలు తీసుకోని పోలీసులు

కాగా రైతుబజార్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నా పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. కూటమి నేతల దందాకు పోలీసులు మద్దతుగా ఉంటున్నారే తప్ప ప్రజల సమస్యలు పట్టించు కోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ ఈ సమస్యపై దృష్టి పెట్టి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, బందరు రోడ్డు పై రాకపోకలు సాగించే వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దోమల నిర్మూలనకు ఫాగింగ్



పి.నైనవరం(విజయవాడరూరల్): ఫిర్యాది నైనవరం గ్రామంలో దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచి బట్టా సోమయ్య తెలిపారు. ఆదివారం గ్రామంలోని ప్రతి వీధిలో ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి ఫాగింగ్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతి కార్యదర్శి అజేంద్ర, బెజవాడ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎన్టీఆర్ జిల్లాలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలను మాని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని, ఎవరైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో బ్యాడ్మింటన్ జోనల్ జోనల్ స్థాయి పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో సింగిల్స్, డబుల్స్ అండ్ మిక్స్‌డ్ డబుల్స్‌లో షేక్ అమీనా విజేతగా నిలిచింది. పోటీల్లో ప్రతిభ చూపిన షేక్ అమీనాకు అతిథులు మెడల్స్‌ను అందజేశారు.

ఇనుప లోడు లారీకి తప్పిన ప్రమాదం



ఆటోనగర్(విజయవాడతూర్పు): గన్నవరం నుంచి చెన్నై వెళ్తున్న ఇనుప లోడు లారీకి ప్రమాదం తప్పింది. ఇందులో ఉన్న ఇనుప షీట్‌లన్ని ఒక పక్కకు ఒరిగి పోవడం వల్ల లారీ రోడ్డుపై ఆగిపోయింది. ఇది గమనించిన ట్రాఫిక్ సీఐ రమేష్‌బాబు తన సిబ్బంది సహాయంతో రెండు క్రేన్‌లను తీసుకువచ్చి.. కదిలిపోయిన ఇనుప షీట్‌లను సరిచేయించారు. గంటల తరబడి కష్టపడాల్సి వచ్చింది. లారీ వెళ్లే సమయంలో ఇనుప షీట్‌లు కింద పడి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు సకాలంలో స్పందించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'ప్రైవేటీకరణ చేస్తే ప్రభుత్వానికి నూకలు చెల్లినట్లే'

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని ముసాఫిర్‌ఖానాను ప్రైవేటీకరణ చేస్తే కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లినట్లేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా నేత షేక్ హసన్ భాష(బాషి) అన్నారు. ఆదివారం వించిపేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముసాఫిర్ ఖానాను ప్రైవేటు పరం చేసే ఆలోచనను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించాలని, లీజు నోటీసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు ఫతావుల్లాకు వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించే అర్హత లేదని ఘాటుగా ధ్వజమెత్తారు. గతంలో టీడీపీప్రభుత్వం ముసాఫిర్ ఖానాకు రూ.15 కోట్లు కేటాయిస్తే వాటిలో 10 కోట్ల రూపాయలు టీడీపీ నాయకులు స్వాహా చేసి కేవలం ఐదు కోట్లతో ముసాఫిర్ ఖానా కట్టి ఓపెన్ చేయలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నిధులు కేటాయించి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ముసాఫిర్ ఖానాను ప్రారంభింప చేశామని గుర్తు చేశారు. నాడు ముసాఫిర్ ఖానా మెయింటినెన్స్ కోసం పూల డెకరేషన్, సామాన్లకు టెండర్లు పిలిస్తే ఆ సాకు చూపించి నేటి కూటమి నాయకులు ప్రైవేటుపరం చేయాలని, తద్వారా దోచుకోవాలని చూస్తున్నారని భాషి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇస్తే పేద ముస్లింలు తమ పిల్లల పెళ్లిళ్లు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. ముసాఫిర్ ఖానా కమిటీ ద్వారా పేదలకు అతి తక్కువ ధరకే శుభాకార్యాలకు అద్దెకివ్వాలని కోరారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సౌమ్య థియేటర్ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరంలో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. 11 రోజుల పాటు అలంకరణలను వివరించారు.

సీతారాం ఏచూరి నేటి తరానికి స్ఫూర్తి



సభలో మాట్లాడుతున్న గన్నె వెంకట్రావు

గన్నవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి సీతారాం ఏచూరి చూపించిన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని దావాజిగూడెంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలకు కట్టుబడి ప్రజల క్షేమమే ధ్యేయంగా ఆయన పనిచేశారని చెప్పారు. దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టే మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. వామపక్ష ప్రజాస్వామ్య లౌకిక శక్తులందరికీ ఏచూరి స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు తెలిపారు. ప్రజలు, కార్మికుల సమస్యలపై చట్టసభల్లో గళమెత్తారని చెప్పారు. అటువంటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన ఏచూరి మరణం దేశ ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన కేంద్రం బాధ్యులు అనుమోలు వెంకటేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి ఎం. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో కలుషిత నీరు సరఫరా

భయాందోళనలు వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



డ్రెయినేజీలో పైపు లీకై వస్తున్న నీరు

పెనమలూరు: చోడవరం గ్రాంలో తాగునీరు కలుషితం అవుతోంది. విజయవాడలో జరిగిన ఘటన దృష్ట్యా కలుషిత నీటి కారణంగా గ్రామంలో కూడా డయేరియా ప్రబలుతుందేమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని శివాలయం వీధిలో గత 10 రోజుల క్రితం మంచినీటి పైపులైన్ పగిలింది. ఈ పైపులైన్ ద్వారానే గ్రామంలో కుళాయిలకు తాగునీరు సరఫరా అవుతోంది. నీటి సరఫరా ఆగినప్పుడు మురుగునీరు పైపుల్లోకి చేరుతోంది. నీరు వదిలినప్పుడు పైపుల ద్వారా ప్రజలకు చేరుతోంది. దీనిపై గ్రామ పంచాయతీ అధికారులు ఎవరూ స్పందించ కపోవటంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను స్వయంగా చెప్పినా కూడా అధికారుల్లో చలనం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామస్తులు అనారోగ్యానికి గురవక ముందే పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలు బహూకరణ



లైబ్రేరియన్‌కు పుస్తకాలను అందజేస్తున్న ఎస్ఐ శ్రీధర్

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయానికి గన్నవరం ఎస్ఐ కె.శ్రీధర్ రూ.11 వేలు విలువైన పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను బహూకరించారు. పుస్తకాలను ఆదివారం గ్రంథాలయాధికారి కే.నాగరాజుకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదువుకుని తను ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. అందుకే తనవంతు సాయంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు పోటీ పరీక్షలకు చదువుకోవడానికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం ఎస్ఐను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, రోటరీక్లబ్ సభ్యులు సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు, సభ్యులు చిమట రామారావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు జీవీ.రవిబాబు, రోటేరియన్లు జాస్తి విజయభూషణ్‌కుమార్, గన్నె వెంకట్రావు, జీ. సురేష్‌బాబు పాల్గొన్నారు.

అధ్వానంగా కాలనీ అంతర్గత రోడ్లు



రాకపోకలకు ఇబ్బందిగా మారిన అంతర్గత రోడ్డు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల కేంద్రమైన బాపులపాడులోని జగనన్న కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికే బురదకయ్యిగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాలనీలో కనీస మౌలిక వసదుపాయాల కల్పనపై దృష్టి పెట్టకపోవటంతో రోడ్ల దుస్థితి కూడా దారుణంగా ఉంది. కాలనీలో దాదాపు 200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావటంతో సుమారు వెయ్యి మందికిపైగా నివాసం ఉంటున్నారు. బురదకయ్యిగా మారిన ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు స్థానికులకు నానాపాట్లు పడుతున్నారు. కాలు తీసి కాలు వేయటానికి కూడా కాలనీ రహదారులపై అస్కారం లేకుండా ఉంది. గుంతలు, బురదమయంగా ఉన్న ఈ రహదారిపై వాహనాదారుల ప్రయాణం సర్కస్ ఫీట్లను తలపిస్తోంది. వృద్ధులు, చిన్నారులు ఈ రోడ్లపై నడిచేందుకు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. చెప్పులు చేతితో పట్టుకుని నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గన్నవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ ఈ.రామమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఏరియా, సొసైటీపేట, గాంధీబొమ్మ సెంటర్, గౌడపేట, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, వీనస్ బజార్, శాంతి థియేటర్, పాత టీడీపీ ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవనంలో ఈ నెల 15వ తేదీన ఉచిత దంత, నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల వైద్యుల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరుగుతుందన్నారు. గన్నవరం తాలూకా యూనిట్ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్ జారీ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం కొరకు దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక తెలిపారు. ప్రియాంక మాట్లాడుతూ మొత్తం 11 మంది ధర్మకర్తల మండలి సభ్యులను నియామకం చేయనుందని పేర్కొన్నారు. ఆశక్తి గల భక్తులు గొల్లపూడిలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకో వాల్సిందిగా సూచించారు. దరఖాస్తులు పరిశీలించిన అనంతరం 45 రోజుల తర్వాత నియామకం జరుగుతుందన్నారు.

వృద్ధులకు ఆసరాగా నిలవాలి

కంకిపాడు: వృద్ధులకు ఆసరాగా నిలవాలని లయన్స్‌క్లబ్ కార్యదర్శి రావి సురేష్ సూచించారు. క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని మద్దూరు గ్రామంలో ఆదివారం వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వృద్ధులకు అండగా నిలవాలన్నారు. వారికి చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు మదన్ మోహన్, యనమదల చిన్ని, వల్లె నరసింహారావు, తీట్ల మధుబాబు, సుబ్బారావు, తీట్ల సాంబశివరావు, లింగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జన ఊరేగింపు

రూ.2.15 లక్షలు పలికిన లడ్డూ



పెనమలూరు: కానూరులో సిరినగర్‌లో వినాయకుడి నిమజ్జన ఊరేగింపు ఆదివారం ఘనంగా చేశారు. గ్రామంలో గత 21 రోజులుగా వినాయకుడి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వినాయకుడి నిమజ్జనం సందర్భంగా 123 కేజీల లడ్డూ వేలం నిర్వహించారు. సూరి కార్ ట్రావెల్స్‌కు చెందిన రెడ్డి నాగరాజు బహిరంగ వేలంలో స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, వేమూరి సురేష ఫ్రెండ్స్‌సర్కిల్, భక్తులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు జరిపారు. దాడుల్లో ఎనిమిది మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుందేరు గ్రామంలో ఊరు చివర కోళ్లకు కత్తులు కట్టి పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఎస్ఐలు డి.సందీప్, డి.తాతాచార్యులు, ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్ నేతృత్వంలో సిబ్బంది దాడి చేశారు. వారి నుంచి రూ.10,300 నగదు, రెండు కోడిపుంజులు, 11 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

కుమారుడు కనపడటం లేదని తల్లి ఫిర్యాదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తన కుమారుడు కనపడటం లేదని తల్లి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురంలోని నివాసముంటున్న అడపా సుశీల తన భర్త, కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తుంది. కుమారుడు అడపా నిఖిల్‌సాయి(21) ఇటీవల డిగ్రీ పూర్తి చేసి కాంపిటేటివ్ పరీక్షల కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. వారి ఇంటికి దగ్గరలోనే 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువతి నిఖిల్‌సాయి వెంటపడి ప్రేమిస్తున్నట్లుగా పేర్కొంది. ఎన్నిసార్లు మందలించినా వెంటపడటం మానలేదు. అలాగే కుమారుడి నుంచి తల్లిదండ్రులు ఫోన్ తీసుకున్నా ఆ యువతి కొత్త ఫోన్ కొనిచ్చింది. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి నిఖిల్‌సాయి కనపడటం లేదని, ఆ యువతి ఇంటికి సైతం తాళం వేసి ఉందని, ఆ యువతే తన కుమారుడిని తీసుకొని వెళ్లినట్లుగా అనుమానంగా ఉందని సుశీల తన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలపై దాడులను నివారించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి

వించిపేట(విజయవాడపశ్చిమ): సమాజంలో రోజు రోజుకు మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హింసలు పెరిగిపోతున్నాయని, వాటిని నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా పశ్చిమ నగర కమిటీ 14వ మహాసభ ఆదివారం కొత్తపేటలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీదేవి మాట్లాడుతూ నేటి సమాజంలో యువత మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వ్యసనాలతో కుటుంబాలను వీధులపాలు చేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి సాధిస్తుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక..

నగరంలో కాలుష్యాన్ని నివారించి పరిశుభ్రమైన తాగునీరు అందించాలని, కొండ ప్రాంతంలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు, వితంతువులు, ఒంటరి మహిళ పెన్షన్‌లు ఇవ్వాలన్నారు. షేక్ రాజాసాహెబ్ హాస్పిటల్‌ను 100 పడకల జనరల్ హాస్పిటల్‌గా అభివృద్ధి చేయాలని, రేషన్ డిపోల్లో 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ తదితర డిమాండ్‌లను ఈ మహాసభలో తీర్మానాలు చేశారు. కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ చదువుతోనే మహిళలు ఆర్థిక స్వావలంభన సాధిస్తారని అన్నారు. అనంతరం ఐద్వా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గాదే ఆదిలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులుగా ఈ.విజయలక్ష్మి,కె.వెంకటరత్నం, సహాయ కార్యదర్శిగా కె. రమా, ఏకే వరలమి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రేపు 'సజీవ చరిత్ర' పుస్తకం ఆవిష్కరణ

పెనమలూరు: ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకాన్ని ఈనెల 16వ తేదీన ఆవిష్కరిస్తున్నట్లు ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ తెలిపారు. మండలంలోని పోరంకిలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ భావజాలాన్ని ఇప్పటి తరానికి అందించే ఉద్దేశంతో గతంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఏర్పాటు చేసి పలు గ్రంథాలను ఆవిష్కరించామని కమిటీ చైర్మన్ టి.డి.జనార్దన్ పేర్కొన్నారు. 1984 ఆగస్టులో ఏపీలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం దేశరాజకీయాలను మలుపు తిప్పిందని, దీనిపై సీనియర్ పాత్రికేయుడు, రచయిత విక్రం పూలతో కలిసి పుస్తక రూపంలో అందిస్తున్నామని పేర్కొన్నారు. పోరంకిలో 16వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పాత్రికేయుడు వెంకటనారాయణ, నందమూరి రామకృష్ణ, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రఘురామ్, అనుమోలు ప్రభాకరరావు పలువురు పాల్గొన్నారు.